క్లుప్తంగా

రాజనాల బండలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

చౌడేపల్లి: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాల బండలోని శ్రీప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధిచేసి అభిషేకాలను అర్చకులు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు స్వామివారికి పూజలు చేసి పాదముద్రికలపై నిలబడి ప్రమాణకాలు చేశారు. భక్తుల రద్దీతో రాజనాల బండ ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఆలయ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ ఆధర్వంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

అడ్మిషన్లు ప్రారంభం

పెద్దపంజాణి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి జూనియర్ కళాశాల అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు హెచ్‌ఎం కేశవపిళ్లై శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో పెద్దపంజాణికి జూనియర్ కళాశాల మంజూరైందని ఎంపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించి కళాశాల అభివృద్ధికి దోహదపడాలన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

పుంగనూరు: ఏడూరులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన దీక్షితులు నటరాజస్వామి ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. పూర్ణాహుతి చేసి స్వామివారికి నైవేద్య కైంకర్యాలు నిర్వహించారు. శ్రీమన్నారాయణ అంటూ భక్తులు స్వామివారిని పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు డీఎస్సీపై ఉచిత డెమో

పలమనేరు: పట్టణంలోని మదనపల్లి రోడ్డులో వాసవి హాస్టల్ మిద్దెపై కుట్టి డీఎస్సీ కోచింగ్ నిర్వాహకులచే నేడు ఉచిత డెమో ఉంటుందని ఆ సంస్థ నిర్వాహకురాలు పవన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాబోయే డీఎస్సీలో ఉద్యోగం సాధించాలంటే ఎలాంటి ప్రణాళికతో చదవాలి, ఎలాంటి మెటీరియల్‌ను ఫాలో కావాలనే అంశాలపై సీనియర్ అధ్యాపకులు సలహాలిస్తారని అందులో పేర్కొన్నారు. అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అందులో కోరారు.

మహిళపై కత్తితో దాడి

కుప్పంరూరల్: ఆర్థిక లావాదేవీల కారణంగా మహిళపై ఓ యువకుడు దాడి చేసిన సంఘటన కుప్పం మండలం యనమనాశనపల్లిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలిలా.. యనమనాశనపల్లికి చెందిన వివాహిత లక్ష్మి, అదే గ్రామానికి చెందిన శివకుమార్ మధ్య గత కొంతకాలంగా ఆర్థిక లావాదేవీలు సాగాయి. వీరి మధ్య ఏర్పడిన వివాదం కారణంగా ఆగ్రహానికి గురైన శివకుమార్ లక్ష్మీపై కత్తితో దాడి చేశాడు. ఘటనలో లక్ష్మీ శరీరంలోకి కత్తి దిగడంతో గమనించిన స్థానికులు ఆమెను కుప్పం ఆస్పత్రికి తరలించారు. లక్ష్మీకి ప్రాణాపాయం తప్పిందని స్థానికులు చెప్పారు. కుప్పం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు బలి

- అధికారులు పట్టించుకోవాలని గ్రామస్తుల వినతి

కుప్పంరూరల్: కుక్కల దాడిలో గత వారం రోజులుగా 30 గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన కుప్పం మండలం, బండశెట్టిపల్లిలో చోటుచేసుకుంది. బండశెట్టిపల్లిలో వీధి కుక్క లు ఎక్కువై నిత్యం ఏదో ఒక ఇంట్లో గొర్రెలను పొట్టన పెట్టుకుంటున్నట్లు గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. గతవారం రోజుల్లోనే గ్రామానికి చెందిన 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయని, అధికారులు చెప్పినా పట్టించుకో వడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రూ.10వేల విలువ చేసే ఒక్కో గొర్రె ఇలా నిత్యం కుక్కల బారిన పడడంతో తీవ్రంగా నష్టపోతున్నామని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను బయటి ప్రాంతాలకు తరలించి ప్రజలను ఆదుకోవాలని కోరుతున్నారు.

నీటి నాణ్యతపై పరీక్షలు




సంపుల్లో నీటి నాణ్యతను పరీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

పలమనేరు: జిల్లాలో వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధుల కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సిబ్బందితో కలిసి పట్టణంలోని నీళ్ల ట్యాంకులు, సంపులను శనివారం నీటి నాణ్యతపై పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎద్దులసంత, నాగమంగళం, వైఎస్సార్ సంపుల వద్ద క్లోరోఫామ్ ద్వారా హెచ్2హెచ్ పరీక్షలను నిర్వహించారు. వర్షాకాలం కావడంతో నీటి ద్వారా పలు రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న కారణంగా ప్రజలు నీటిని కాచి వడబోచి తాగాలని సూచించారు. ఇంట్లో దోమలు రాకుండా దోమ తెరలను వాడాలని తెలిపారు. ఆయన వెంట స్థానిక నీటి విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న కొత్తిమీర

- చిన్న రైతులకు పెద్ద పంట!
- తక్కువపెట్టుబడితో సాగు
- పంట కాలం కేవలం 60 రోజులే
- ఏడాది పొడవునా సాగుకు అనుకూలం
- తక్కువ పెట్టుబడితో నికర లాభాలు



పలమనేరు ప్రాంతంలో సాగవుతున్న కొత్తిమీర, (ఇన్‌సెట్) డా.అన్నపూర్ణదేవి, అగ్రికల్చర్ ఏడీ, పలమనేరు

పలమనేరు: చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో పండించే సుగంధ ద్రవ్యాల పంటల్లో ముఖ్యమైన పంట కొత్తిమీర. సన్న, చిన్నకారు రైతులకు నీటి వసతి తక్కువగా ఉన్న రైతులకు ఈ పంట ఎంతో లాభదాయకం. తక్కువ వ్యవధిగల కొత్తిమీర సాగుపై రెతులు ఆసక్తి చూపుతున్నారు. పొరుగునే ఉన్న కర్ణాటకలో చాలామంది రైతులు దీర్ఘకాలిక పంటలకు స్వస్తి చెప్పి కొత్తిమీర సాగు చేస్తున్నారు. వీరిని చూసి సరిహద్దు మండలాల్లోని ఇక్కడి రైతులు ప్రస్తుతం కొత్తిమీర సాగుపై దృష్టి సారించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంటసాగుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ గురించి పలమనేరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డా.వై.అన్నపూర్ణదేవి వివరించారు.

చల్లటి వాతావరణం గల పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో ఈ పంటను ఏడాది పొడవునా సాగు చేసుకోవచ్చు. తక్కువ నీటి వసతిగల రైతులకు ఎంతో సౌకర్యమైన పంట. ఏడాది పొడవునా నాటుకోవచ్చు. పంట కాలం కేవలం 50 నుంచి 60 రోజులు మాత్రమే. ధనియాలైతే ఎకరానికి ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి ఉంటుంది. స్థానికంగా లభించే పలు రకాల హైబ్రిడ్ విత్తనాలను సాగుచేసుకోవచ్చు. కొత్తిమీర కోసం లేదా ధనియాలకోసం కూడా సాగు చేసుకోవచ్చు.

నేల తయారీ, విత్తటం..

భూమిని నాలుగు సార్లు బాగా దుక్కి చేసుకోవాలి. విత్తనాలను బద్దలుచేసి నాటితే విత్తన ఆదాతో పాటు త్వరగా మొలక వస్తుంది. విత్తేముందు కొత్తిమీర విత్తనాలను నాలుగు గంటలపాటు నానబెట్టి ఆపై ఆరనిచ్చి విత్తాలి. ఎకరానికి ఆరు కిలోల విత్తనం సరిపోతుంది. విత్తడానికి ముందు అజోస్పైరిల్లం(బయోఫర్టిలైజర్) ఎకరానికి 600 గ్రాముల చొప్పున విత్తనశుద్ధి చేసుకోవాలి. ఫామ్‌హౌస్‌లో పంట సాగు చేస్తే వందశాతం ఫలితాలను సాధించవచ్చు.

సస్యరక్షణ..

పేనుబంక నివారణకు మోనోక్రోటోఫాస్‌ను లీటర్ నీటికి రెండు మిల్లీ పిచికారీ చేయాలి. ఎర్రనల్లికి గంధకం వాడుకోవాలి. తామర పురుగులు, పొగాకు లద్దెపురుగులకు డైమిథోయేట్, ఏసిఫేట్‌లను లీటర్ నీటికి గ్రాము చొప్పున వాడుకోవాలి. ఇక బూడిద తెగుళ్లకు కార్బండిజమ్, ఎండు తెగులకు ఆక్సీస్పోరమ్‌ను వాడాలి.

ఎరువులు, అంతరకృషి..

నాలుగు టన్నుల పశువుల ఎరువు, 25 కిలోల యూరియా, 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 15 కిలోల పొటాష్‌ను ఎరువుగా వాడుకోవాలి. విత్తిన వెంటనే పెండి మిథాలిన్‌ను ఎకరా నేలకు ఒక లీటర్‌ను 200 లీటర్ల నీటిలో కలుపుకుని పిచికారీ చేసుకోవాలి. దీంతో చాలా వరకు కలుపు నివారణ జరుగుతుంది. విత్తనం పూర్తిగా మొలకెత్తాక ఓ సారి, నెల రోజులకు రెండో సారి గొర్రుతో అంతర కృషిచేయాలి. ఇందులో అంతరపంటలుగా ధనియాలతో బాటు ఆవాలు, కుసుములు, శనగలు, మిశ్రమ పంటలుగా కూడా వేసుకోవచ్చు. ఇది పంటకు అదనపు లాభంగా ఉంటుంది.

కోతలు...

కొత్తిమీరకైతే ముందుగానే 30 రోజుల నుంచి కోతలు కోసుకోవచ్చు. ధనియాల కోసమైతే మనం సాగుచేసే రకాన్ని బట్టి 60 రోజుల నుంచి పక్వాని కొస్తాయి. పంటను ఉదయం పూట మాత్రమే కోయాలి. కోసినాక రెండు రోజుల పాటు పొలంలో ఆరనించి ఆపై నూర్చుకోవాలి. పంట సాగులో రైతులకు నిఖర లాభాలు తప్పకుండా ఉంటాయి. అయితే పంట మార్పిడిని పాటించాలి. ప్రస్తుతం కొత్తిమీర కట్ట రూ.30 ఉండగా ధనియాలు కిలో రూ.130గా ఉంది. ఈమాత్రం ధర ఉన్నా రైతులకు మంచి గిట్టుబాటు అవుతుంది.

భాగ్యవతికి నివాళి





మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, నివాళులర్పిస్తున్న సునందమ్మ

పలమనేరు: మండలానికి చెందిన సర్పంచుల సంఘ అధ్యక్షుడు, మొరం పంచాయతీ సర్పంచ్ విశ్వనాథ రెడ్డి సతీమణి భాగ్యవతి(56) శుక్రవారం షిర్డీలో మృతిచెందిన విషయం తెలిసిందే, ఆమె మృతదేహం స్వగ్రామానికి శనివారం తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆమె మృతదేహానికి పూలమాలవేసి నివాళుర్పించి వారి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తల్లి సునందమ్మ సైతం భాగ్యవతి మృతదేహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ నేత భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోదండయ్య

నగరి : కొత్త ప్రభుత్వాలు ఏర్పాటయ్యాక అధికార మార్పిడి జరిగిన ప్రతిసారీ కార్మికులను మార్చాలనుకోవడం అవివేకమని, కార్మికులపై రాజకీయ ఒత్తిళ్లను ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, గౌరవ అధ్యక్షులు నాగరాజు అన్నారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ సభ్యుల సమావేశంలో మారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పాఠశాలలో వంట కార్మికులను మార్చాలని కొంతమంది కొన్ని ప్రాంతాల్లో ఒత్తిడి తీసుకొని రావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారం చేపట్టిన వెంటనే కొంతమంది చోటా నాయకులు స్థానికంగా ఉన్న రాజకీయ కక్ష సాధింపులో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించాలని పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పెద్దలు స్థానిక ఎమ్మెల్యేలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న స్థానిక నాయకులను కార్మికుల జోలికి వెళ్లకుండా చూడాలని ఏఐటీయూసీ తరపున కోరుతున్నామన్నారు. అంగన్‌వాడీలకు జీతాలను పెంచాలన్నారు. పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పూర్తికాని అంగన్‌వాడీ భవనాలను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం చిత్తూరుకు వెళ్లి డీఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి దాసరి చంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి నాయకులు రఘు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ, జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి, జిల్లా నాయకులు శాంతి, అరుణ రాధమ్మ, రమాదేవి, రాధా, ఝాన్సీ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

తప్పిన పెనుప్రమాదం

- సురక్షితంగా బయటపడిన కుప్పం వాసులు



ప్రమాద సమయంలో విద్యుత్ తీగల రాపిడితో ఎగిసిపడుతున్న మంటలు

కుప్పంరూరల్: కారు వేగంగా వచ్చి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సంఘటనలో కుటుంబానికి ఎలాంటి ప్రమాదం లేకుండా బయటపడిన సంఘటన కుప్పం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. కుప్పం పట్టణానికి చెందిన ఓ కుటుంబం తీర్థ యాత్రల నిమిత్తం తమిళనాడుకు వెళ్లి యాత్ర ముగించుకుని కుప్పం కేఏ41ఎంఈ1978 నంబరు గల కారులో తిరుగు ప్రయాణమయ్యారు. కుప్పం సమీపంలోని తంబిగానిపల్లి వద్దకు రాగానే డ్రైవర్ అదుపు తప్పి కారును విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగి తీగల నుంచి పెద్దఎత్తున అగ్ని ఎగిసిపడింది. కారు స్థంభాన్ని ఢీకొని 20 అడుగులు ముందుకుపోవడంతో కారులోని కుటుంబ సభ్యులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. రెస్కో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ తీగలను తొలగించారు. శనివారం ఉదయం విద్యుత్ స్తంభాన్ని మార్చి సరఫరాను పునరుద్ధరించారు. కాగా ప్రమాదంపై ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు చెప్పారు.

క్షయపై యుద్ధం!

- విస్తృతంగా బీసీజీ టీకాలు
- ముమ్మరంగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు
- 2025కి టీబీ రహిత సమాజమే ధ్యేయంగా అడుగులు



వ్యాక్సినేషన్ కార్యక్రమంలో వైద్యాధికారులు

సదుం: భారత ప్రభుత్వం 2025 నాటికి టీబీ నిర్మూలన లక్ష్యాన్ని నిర్దేశించింది. ఎక్కువ వయసు ఉన్న వారికి వ్యాధి సోకే అవకాశం ఉండడంతో ఉచితంగా బీసీజీ టీకా ఇవ్వడం ద్వారా నూతనంగా టీబీ కేసులు తగ్గించే అవకాశం ఉంటుందని భావిస్తోంది. దేశంలో 1978 నుంచి నవజాత శిశువులకు వ్యాక్సిన్ ఇవ్వడం ద్వారా టీబీ మరణాలను నివారించేలా చర్యలు తీసుకుంది. టీబీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఉచిత నిర్ధారణ పరీక్షలు, చికిత్స అందిస్తోంది. ప్రస్తుతం వయోజనులకు టీబీ రాకుండా ప్రతి గురువారం వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వైద్యాధికారుల ఆధ్వర్యంలో విస్తృతంగా నిర్వహిస్తున్నారు.

సురక్షితం: బీసీజీ టీకా సురక్షితమని వైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు. టీకా వేయించుకున్న పది మందిలో ఒక్కరికి బుడిపె, పుండు, మచ్చ ఏర్పడుతుందని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా టీబీ వచ్చే ప్రమాదం తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. అనర్హులుగా గుర్తించిన వారు వ్యాక్సిన్ తీసుకుంటే లింపు గ్రంథుల వాపు, చీము పట్టడం (వెయ్యి నుంచి 10 వేల మందిలో ఒకరికి), ఎముకల వాపు (3,500 వేల నుంచి 10 లక్షల మందిలో ఒకరికి) వంటి దుష్ప్రభావం కలిగే అవకాశం ఉందన్నారు.

స్వచ్ఛందమే: బీసీజీ టీకాను వేయించుకోవడం లేక తిరస్కరించడం స్వచ్ఛందమన్నారు. టీకా తిరస్కరణకు కారణాలు చెప్పనవసరం లేదన్నారు. టీకా వేసే ముందు అంగీకార పత్రంపై సంతకం చేయాలని సూచించారు.

బీసీజీ టీకాకు అర్హులు

- 60 సంవత్సరాలు పైబడిన వారందరూ
- ఐదు సంవత్సరాల క్రితం టీబీ వచ్చి తగ్గిన వారు
- 18 సంవత్సరాలు నుంచి 60 ఏళ్లలోపు ఉన్న వారిలో పొగ తాగేవారు, గతంలో తాగుడు నిలిపేసిన వారు, షుగర్ వ్యాధి గ్రస్తులు, బీఎంఐ 18 కన్నా తక్కువ ఉన్న వారు, టీబీ వ్యాధి గ్రస్తులతో సంబంధం ఉన్న వారు సైతం టీకాలకు అర్హులుగా గుర్తించారు.

టీకాకు అనర్హులు..

- గర్భిణులు, పాలిచ్చే మహిళలు
- ప్రస్తుతం టీబీతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారు
- హెచ్ఐవీ, ఎయిడ్స్, కేన్సర్ వ్యాధిగ్రస్తులు
- అవయవాల మార్పిడి చేసుకున్న వారు, రోగ నిరోధక శక్తి తగ్గించే మందులు వాడుతున్న వారు
- ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న వారు
- మూడు నెలల్లో రక్తమార్పిడి జరిగిన వారు
- టీకాలు వేయించుకుంటే రియాక్షన్ ఉన్న వారు
- సెక్స్ వర్కర్లు, ఇంజక్షన్ల ద్వారా మత్తుమందు తీసుకునే వారు

అందరూ సహకరించాలి..



టీబీ రహిత సమాజం కోసం అందరూ సహకరించాలి. పీహెచ్‌సీ పరిధిలో ప్రతి గురువారం వయోజన టీకా కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 4,055 మందికి వ్యాక్సినేషన్ అందించాం. ఉచిత టీకా కార్యక్రమాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ గిరీషా, చెరుకువారిపల్లె పీహెచ్‌సీ, సదుం

ఘనంగా అఖండ హరినామ స్మరణం



భజన చేస్తున్న భక్తులు

వి.కోట: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం భక్తులచే అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులచే ఉదయం నుంచి భజన కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం స్వామివారి నామస్మరణతో మారుమోగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సీతారామయ్య మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా ప్రతి శనివారం భక్తులచే అఖండ హరినామస్మరణతో భజన కార్యక్రమం, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. శనివారం గాండ్లపల్లి వెంకటేష్, గ్రామోదయ మాక్స్ సంస్థ సహకారంతో భజన కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



గుండిశెట్టిపల్లి వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్, ఎస్పీలు

శాంతిపురం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనలో భాగంగా సందర్శించనున్న ప్రాంతాలను జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ మణికంఠ పరిశీలించారు. శనివారం గుండిశెట్టిపల్లి, చిన్నారిదొడ్డి, జల్లిగానిపల్లి వద్ద హంద్రీనీవా కుప్పం కాలువను జిల్లా అధికారులు పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాట్లు, చేయాల్సిన భద్రత చర్యలపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. హంద్రీనీవా కెనాల్‌పై ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం కుప్పంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద బహిరంగ సభ ప్రాంతాన్ని, కుప్పంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

విద్యార్థులకు బోధనా సామగ్రి వితరణ



విద్యార్థులకు అందజేస్తున్న బోధనా సామగ్రి

చౌడేపల్లి: వాసవీ వనిత క్లబ్ సహకారంతో శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బోధనా సామగ్రిని వితరణగా అందజేసినట్లు ఎంఈఓ కేశవరెడ్డి తెలిపారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవిచంద్రన్ ఆదేశాల మేరకు సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘ వైస్ చైర్మన్ వరదరాజులు పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు ప్రత్యేక ప్రతిభావంతులకు చేయూతనిచ్చినట్లు తెలిపారు. పేద విద్యార్థులకు చేయూతనిచ్చిన వాసవి, వనిత క్లబ్ నిర్వాహకులకు ఎంఈఓలు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఈఓ తిరుమలమ్మ, హెచ్‌ఎం జగన్‌మోహన్‌రెడ్డి, క్లబ్ రీజియన్ చైర్మన్ బాలాజి, పీఓ రమ్య, రామ్‌కుమార్, ఉషారాణి, శ్రీనాథ్, పుష్పలత, లోకేష్, లలితకుమారి ఉన్నారు.

ఏఎంసీ డైరెక్టర్లకు మొదలైన పైరవీలు!

- రంగంలోకి దిగిన పలువురు బ్రోకర్లు
- స్థానిక ఎమ్మెల్యేకి తెలియకుండానే రాజకీయాలు

పలమనేరు: పలమనేరు మార్కెట్ కమిటీకి సంబంధించిన డైరెక్టర్ల పదవిలిప్పిస్తామంటూ కొందరు బ్రోకర్లు అప్పుడే రంగంలోకి దిగి పైసావసూల్ కార్యక్రమాలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా హేమంత్‌కుమార్‌రెడ్డి, ఆయన కమిటీ ఇటీవల రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం కొత్త కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఏఎంసీ చైర్మన్ నియామకం పూర్తిగా ఇక్కడి ఎమ్మెల్యే, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డిపై ఆధారపడి ఉంటుంది. కాగా ఇక్కడి టీడీపీ నాయకులు కొందరు పార్టీకోసం కష్టపడిన వారికి డైరెక్టర్ల పోస్టులివ్వాలంటూ ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేకు సిఫారసుతు చేశారు. మరికొన్ని పేర్లు సైతం తెరపైకి తెస్తున్నారు. ఇదే అదునుగా నియోజకవర్గానికి చెందిన కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు, మధ్యవర్తులు సైతం తాము నేతల ద్వారా డైరెక్టర్ పోస్టులిప్పిస్తామంటూ రాజకీయాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. తాజాగా పలమనేరు మండలానికి చెందిన ఓ వ్యక్తి తాను చెప్పిన వారికే డైరెక్టర్ పోస్టులంటూ నిత్యం కొందరికి ఆశపెట్టి పబ్బంగడుపుకుంటున్న సమాచారం. ఇది నిజమేనని కాంగ్రెస్ నేతలు సైతం ఇలాంటి బ్రోకర్లను నమ్మడం కొసమెరుపు. ఇదేకాదు నియోజకవర్గంలోని పీఏసీఎస్ చైర్మన్ నామినేటెడ్ పదవులిప్పిస్తామంటూ టీడీపీకి సంబంధం లేని దళారులు సైతం అమాయకులను ఏమార్చుతున్నారనే మాట వినిపిస్తోంది. ఇలాంటి వారిపై తగిన చర్యలు తీసుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే ఇప్పటికే సిద్ధమైనట్టు తెలుస్తోంది.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

చౌడేపల్లె: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉంటూ విద్యను అభ్యసించాలని హెచ్‌ఎం నాగరాజురెడ్డి సూచించారు. శనివారం చౌడేపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ర్యాలీ నిర్వహించారు. 14 ఏళ్లలోపు విద్యార్థులందరూ తప్పనిసరిగా చదువుకోవాలని నినదించారు. సమాజంలో విద్యకున్న ప్రాముఖ్యతను వివరిస్తూ ప్లకార్డులతో అవగాహన కల్పించారు. బడికి రాని పిల్లలను వెంటనే బడిలో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు సుధాకర్, మురళి, రాజేంద్ర ఉన్నారు.

గజేంద్రుడిపై శ్రీరాముడి వైభవం



ఆలయంలో స్వామికి ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

- భక్తితో స్వామికి ఊంజల్ సేవ
- నేడు వైభవంగా రథోత్సవం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు శ్రీ కోదండరాముల దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గజేంద్రుడిపై శ్రీరాముడు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం వేదపండితులచే ఆలయంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేయించారు. భక్తితో స్వామికి ధూపదీప నైవేద్యం, కైంకర్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం చేశారు. సాయంకాలం ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజాసామగ్రి, సుగంధ పుష్పాలు, ప్రసాదాలను ఊరేగింపుగా తెచ్చి సమర్పించారు. పండితులు స్వామికి అభిషేకం, పూజలు చేయించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గజేంద్రుడిపై శ్రీరాముడి వైభవం...

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గజవాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామికి పూజాసామగ్రి, గజమాలలు, సుగంధపరిమళ పుష్పాలు, వివిధ రకాల ప్రసాదాలతో మంగళవాయిద్యాలు నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు, అర్చలు చేయించి నైవేద్యం సమర్పించారు. వేదమంత్రాలు పఠనం చేసి స్వామికి పూజలు చేసిన తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గజేంద్రుడిపై కొలువుదీరిన శ్రీరాముడు పురవీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళహారతులిచ్చి మొక్కులు తీర్చుకొన్నారు.

నేడు రథోత్సవం

ఆలయంలో ఆదివారం ఉదయం ఉభయదారులచే తిరుమంజనం, పాలాభిషేకం, తోమాల సేవ, మధ్యాహ్నం 11 గంటలకు ఊంజల్ సేవ, మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు. సాయంకాలం ఊంజల్‌సేవ, కర్పూర హారతి నిర్వహిస్తామని పేర్కొన్నారు. రథోత్సవం సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు అన్నదానం ఉంటుందని వివరించారు.